www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 11 డిసెంబర్ 2025
5
తూర్పుగోదావరి

## క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

ప్రజాశక్తి - గోపాలపురం

సంక్రాంతి సందర్భంగా ఆర్ అండ్ ఎం ఫౌండేషన్, ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు సౌజన్యంతో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలకు ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలపురం, కొవ్వూరు, పోలవరం, చింతలపూడి, ఉంగుటూరు నియోజకవర్గాలకు చెందిన జట్లు ఎంట్రీ నమోదు చేసుకోవాలన్నారు. మండలం నుంచి ఎన్ని జట్లు అయినా పాల్గొనవచ్చునని తెలిపారు. విన్నర్ జట్టుకు రూ.1 లక్ష, రన్నర్ జట్టుకు రూ.75 వేలు, మూడో స్థానంలో నిలిచే జట్టుకు రూ.50 వేలు బహుమతిని అందిస్తారని తెలిపారు. ఈ నెల 25 లోపు రూ.3 వేలు చెల్లించి ఎంట్రీ చేసుకోవాలని కోరారు. ఈనెల 30 నుంచి క్రికెట్ టోర్నీ ప్రారంభం అవుతుందని నిర్వాహకులు వెల్లడించారు.

# బిపిఎస్‌కు స్పందన కరువు

**- నిబంధనలకు విరుద్ధంగా 974 భవనాలు**
**- కేవలం 60 మంది నుంచే దరఖాస్తులు**
**- 2026 మార్చి 11 వరకు గడువు**

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా 974 భవనాలు నిర్మాణాలు జరిగిపోయాయి. అయితే ఇప్పటి వరకూ బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బిపిఎస్)కు 60 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. 1985 జనవరి నుంచి 2020 ఆగస్టు 31వ తేదీ వరకు నిబంధనలను మీరి నిర్మించిన ఇళ్లు, బహుళ అంతస్తుల భవనాలను బిపిఎస్‌లో ప్రభుత్వానికి తగిన రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చని ఈ

### ఇప్పటికే నోటీసులు జారీ

నగర పాలక సంస్థ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన గృహ యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాము. ఈ ఏడాది నవంబరు 20 నుంచి 120 రోజుల్లోగా దరఖాస్తుకు గడువు ఇచ్చారు. ఈ సదవకాశం భవిష్యత్‌లో రాకపోవచ్చు. ఇప్పటి వరకూ 60 మంది దరఖాస్తు చేసుకున్నారు. భవన యజమానులు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. ఈ నేపథ్యంలో లైసెన్సు కల్గిన సర్వేయర్ల వద్దకు క్యూ కడుతున్నారు. అయితే లైసెన్సు కల్గిన సర్వేయర్లు కొరత ఉంది. రోజుకు రెండు దరఖాస్తులకు మించి చేయలేని పరిస్థితి ఉంది.

**-పి.నాయుడు, టిపిఒ, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్**

నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

ఏడాది నవంబరు 20న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దరఖాస్తులు చేసుకునేందుకు 2026 మార్చి 11 వరకూ గడువు విధించింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని మునిసి పాలిటీల్లోను బిపిఎస్‌కు దరఖాస్తులు వస్తున్నాయి. కాని, రాజమహేంద్రవరంలో మాత్రం ఆయా భవన యజమానులు దరఖాస్తులు చేసుకోవటంలో ఆలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**భవన యజమానుల అలసత్వం**

నగర పాలక సంస్థ పరిధిలో అనుమతి ఇచ్చినప్పటి నుంచి భవన నిర్మాణం పూర్తయ్యే వరకు టౌన్ ప్లానింగ్ అధికారులు నిరంతరం తనిఖీలు చేయాలి. కాని, గత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిబంధనలను తుంగలో తొక్కి భవనాలు వెలశాయి. తెలిసో తెలియక నిబంధనలను పక్కన పెట్టి భవనాలు నిర్మించిన యజమానులను అనుభవం లేని బిల్డింగ్ ప్లాన్‌లు ఇచ్చే ఇంజనీర్లు కొంత మోసం చేశారు. రూ.లక్షల్లో ఫైన్‌లు వేస్తామని చెబుతూనే వారిని కాపాడినట్లు నటించి లక్షల రూపాయలు తీసుకున్నట్లు అనేక ఉదాహరణలు ఉన్నాయి. భవన యజమానుల వద్ద ఎంతో కొంత నగదు తీసుకున్న తర్వాత ఆ అధికారులు ఉన్నంత కాలం ఎలాంటి ఇబ్బందులు రాలేదు. వారు బదిలీపై వేరే చోటికి వెళితే.. కొత్తగా వచ్చిన అధికారులతో భవన యజమానులకు మళ్లీ ఇబ్బందులు తప్పడం లేదు. ఈ దుస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వం బిపిఎస్‌కు దరఖాస్తు చేసుకును క్రమబద్ధీకరించుకోవడంతో పూర్తిగా ఉపశమనం లభించే అవకాశం ఉంది. అయితే ఆయా భవన యజమానులు మాత్రం అలసత్వంగానే వ్యవహరిస్తున్నారు.

**బిపిఎస్‌తో ప్రయోజనాలు**

తాజాగా ప్రకటించిన బిపిఎస్‌తో అనధికార నిర్మాణాలు చట్టబద్ధమవుతాయి. అదే విధంగా విద్యుత్, మంచినీటి కనెక్షన్, వ్యాపార లైసెన్సులు పొందడంలో సౌలభ్యం కలుగుతుంది. ఆస్తి విక్రయం, బ్యాంకు రుణాలకు పూర్తి చట్టబద్ధత కలుగుతుంది. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లభ్యమవుతుంది. స్థానిక సంస్థల అభివృద్ధి నిధులు పెరగడంతో నగర అభివృద్ధి సాధ్యం అవుతాది. అయితే దరఖాస్తు చేయకపోతే కలిగే నష్టాలతోపాటు, నిరంతర అపరాధంగా అధికారులు పరిగణిస్తారు. భారీగా జరిమానాలు వేయడం, భవనాన్ని సీజ్ చేయడం లేదా కూల్చివేత వంటి చట్టపరమైన చర్యలుంటాయి. బ్యాం కు రుణాలు, క్రయ విక్రయాలు సమస్యాత్మకంగా మారతాయి. ఆ భవన యజమానికి భవిష్యత్‌లో ఎటువంటి అనుమతులు ఇవ్వరు. బిల్డర్, డెవలపర్‌లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టడంతోపాటు కోర్టులో కేసులు వేస్తారు. ఇటువంటి పరిస్థితులను బిపిఎస్‌తో అధిగమించే అవకాశం ఉంది.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్

## ప్రయివేటీకరణ ఆలోచనలు మానుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

కందుకూరి విరేశలింగం విద్యా సంస్థలను ప్రయివేటీకరణ చేసే ఆలోచనలను పాలకులు మానుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ అన్నారు. బుధవారం నగరంలోని విక్రమహాల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశం సందర్భంగా నగరంలో విద్యార్థి ప్రదర్శన, బహిరంగ సభకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. దారుణమని. ప్రజాస్వామ్య హక్కులను పోలీసులు కాలరాస్తున్నారని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ చేపట్టిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం కందుకూరి విద్యా సంస్థలను ప్రభుత్వపరం అయ్యాయని అన్నారు. అయితే ప్రస్తుత హితకారిణి సమాజం ఛైర్మన్ దురుసుగా వ్యవహరించి కళాశాల అనుబంధ హాస్టల్‌ను వారి నిర్వాహణలోకి లాక్కోవడం దారుణమన్నారు. ఈ చర్యలకు అర్బన్ ఎంఎల్ఎ అండగా నిలవడం, పోలీసులు ఎస్ఎఫ్ఐ నాయకత్వాన్ని భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. ఈ ఆలోచనలను తక్షణమే మానుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులు, విద్యావేత్తలు, మేధావులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. రాష్ట్రంలో పెండింగులో ఉన్న రూ.6000 కోట్ల ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, జిఒ నెం 77 రద్దు చేయాలని, మెడికల్ కళాశాల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేవారు. ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభ తిరుపతిలో జరుగుతుందని, ఆ సభలో విద్యార్థుల సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యచరణను ప్రకటిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా మాట్లాడారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.కనక, కె.జ్యోతిర్మయి, సౌమ్య, లహరి, శివబాలాజీ, కార్తిక్, హేమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

ప్రజాశక్తి - కొవ్వూరు

ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, జడ్‌పి ఛైర్‌పర్సన్ గంట పద్మశ్రీ సూచించారు. బుధవారం స్థానిక జడ్‌పి బాలికల హైస్కూల్‌లో కూటమి ప్రభుత్వం విజయకేతనం పేరుతో అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ను విద్యార్థినులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయివేటు స్కూల్స్‌కి ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను కూటమి ప్రభుత్వం అభివృదిచేస్తుందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి విద్యార్థులకు కావలసిన వసతులు కల్పిస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు విద్య అందించడంలో విజయకేతనం పేరుతో మెటీరియల్‌ను అందిస్తుందన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఒ కె.వాసుదేవరావు, టుమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ భావన రత్నకుమారి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న జడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎంఎల్ఎ ముప్పిడి

## 13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఈ నెల 13న 4వ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడ్డదగ్గ క్రిమినల్, సివిల్, కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు, తదితర కేసులు పరిష్కరించుకోవచ్చునని అన్నారు. గత 3 జాతీయ లోక్ అదాలత్‌లో 756 సివిల్ కేసులు, 547 యాక్సిడెంట్ కేసులు, 15431 రాజీపడ్డదగ్గ క్రిమినల్ కేసులు, 518 ప్రీ-లిటిగేషన్ కేసులు మొత్తం 17073 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. 13న నిర్వహించే లోక్ అదాలత్‌కు 46 బెంచులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌కు 18,035 కేసులను రాజీ చేయడానికి గుర్తించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో డిఎల్ఎస్ఎ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

### పల్లె ప్రగతికి కూటమి ప్రభుత్వం బాటలు

ప్రజాశక్తి - నిడదవోలు

రాష్ట్రవ్యాప్తంగా పల్లె ప్రగతికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఎపిఆర్ఎస్‌పి తొలి దశలో తూర్పుగోదావరి జిల్లాలో రూ.72.39 కోట్లతో 125 కి.మీల గ్రామీణ రహదారులకు మహర్దశ రానుందని అన్నారు. మెరుగైన నాణ్యతతో రోడ్లు నిర్మించడం, మరమ్మతులు చేయడం తద్వారా రవాణా సౌకర్యాలను మెరుగుపర్చే ఉద్దేశంతో అభివృద్ధికి పర్యాయపదంగా కూటమి ప్రభుత్వం నిలిచిందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల రోడ్లు పట్టణ రోడ్లకు ధీటుగా నిర్మాణం జరగనున్నాయని అన్నారు. గడిచిన ఐదేళ్లలో నిడదవోలు నియోజకవర్గంలోని గ్రామీణ రహదారులు పూర్తిగా అధ్వాన్నస్థితికి చేరుకొని వాహనదారులు ప్రమాదాల భారిన పడ్డారని అన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 21 రహదారులకు మరమ్మతులు, నిర్మాణ పనులకు రూ.28.89 కోట్ల ప్రత్యేక పిఆర్ఆర్ (ప్లాన్) నిధులను కేటాయించినట్లు తెలిపారు. ఉండ్రాజవరం మండలంలో 9 పనులకు రూ.15.56 కోట్లు, పెరవలి మండలంలో 5 పనులకు గానూ 8.71 కోట్లు, నిడదవోలు మండలంలో 7 పనులకు గానూ రూ.4.62 కోట్లు కేటాయించిందని ఆయన తెలిపారు. ఇప్పటికే గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ క్రింద కొన్ని రహదారులకు మరమ్మతులు చేశామని, ప్రస్తుతం అధునాతన పరిజ్ఞానంతో నిర్మించే రోడ్లతో రహదారి వ్యవస్థ మరింత పటిష్టంగా కానున్నదని అన్నారు.

# భూగర్భ జలాల పెంపుపై చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో భూగర్భజలాలను పెంచుకునేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, భూగర్భజలాలు, డ్వామా, గ్రామ/వార్డు సచివాలయ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలాల గణాంకాలపై నిశితంగా దృష్టి సారించి, పెరుగుదల దిశగా స్పష్టమైన కార్యాచరణ చేపట్టాలని సూచించారు. డ్వామా ఆధ్వర్యంలో డిసిల్టేషన్, బుష్ క్లీరెన్స్, ఇంకుడు గుంతలు, కుంటల పునరుద్ధరణ వంటి పనులకు సంబంధించిన సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జల సంరక్షణ పద్ధతులపై స్థానిక సంస్థల భాగస్వామ్యంతో చేపట్టాల్సి ఉందన్నారు. జలవనరుల శాఖ గోదావరి కాలువలు సహా ప్రధాన కాలువల్లో లీకేజీల నివారణ, గట్ల పటిష్టతపై తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో సమగ్ర నివేదికను అందజేయాలని ఆదేశించారు. భూగర్భ జలాల శాఖ మండలాల వారీగా ప్రత్యేక గణాంకాలు, రియల్ టైమ్ పర్యవేక్షణ అందించాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో భూగర్భ జలాలు పెరిగే దిశగా ఎంపిడిఒలు నిర్దిష్ట లక్ష్యాలను సాధించాలని ఆమె ఆదేశించారు. రూరల్ వాటర్ సప్లయి ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టవలసిన పనులు, అందుకు అనుసరించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. జిల్లాలో ప్రస్తుతం 88 గ్రామాల్లో భూగర్భ జలాలు అత్యల్ప స్థాయిలో, 122 గ్రామాల్లో సగటు కంటే తక్కువగా ఉన్నాయని తెలిపారు. అడవుల సంరక్షణ పద్ధతుల్లో, విస్తృత స్థాయిలో ఇంకుడు గుంతలు నిర్మాణం, చెరువుల పూడిక తీత, ఇతర పరిరక్షణ వంటి చర్యల ద్వారా 80 శాతం భూగర్భ జలాల డిశ్చార్జ్ నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. రాబోయే వేసవి సీజన్‌లో నీటి అవసరాలు దృష్టిలో ఉంచుకుని పకడ్బందీగా క్షేత్ర స్థాయి పనులు ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ కె.గోపినాథ్, భూగర్భ జలాల శాఖ డీడీ వై.శ్రీనివాస్, జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి పి.వీణాదేవి, డ్వామా ఎఒ కిషోర్, ఇతర శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

# స్పార్క్‌తో సృజనాత్మకత వెలికితీత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు స్పార్క్ కార్యక్రమం దోహదం చేస్తుందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె అన్నారు. ఆర్ట్స్ కళాశాలలో జరుగుతున్న స్పార్క్ కార్యక్రమం బుధవారం రెండో రోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, పారిశ్రామికవేత్తలు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ హబ్‌పై ప్రిన్సిపల్ అవగాహన కల్పించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులలో సృజనాత్మక, విలువల్ని పెంపొందించే దోహదం చేస్తాయన్నారు. కొంతమంది విద్యార్థులు క్యాంపస్ నుంచి అరకు కాఫీ స్టాల్స్, కృత్రిమ ఆభరణాల యూనిట్లు, చేపల పెంపకం, అలంకార చేపల వ్యాపారాలు, జనపనార బ్యాగుల తయారీ వంటి వ్యాపారాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు శ్రీరామచంద్రమూర్తి, గణేష్, ఎం.శ్రీరామన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి వాణీధర్ రామన్, ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సమన్వయ కర్త డాక్టర్ ఎన్.బేబీనిర్మల, సభ్యులు డాక్టర్ కె.నవీన్‌కుమార్, బి.వెంకటరావు, డాక్టర్ ఎ.వి.అన్నపూర్ణ, కోఆర్డినేటర్ బి.దుర్గాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర

### సిఐటియు నాయకునికి పరామర్శ

ప్రజాశక్తి - నల్లజర్ల

పితృ వియోగంతో బాధపడుతున్న సిఐటియు జిల్లా నాయకులు కొక్కిరిపాటి వెంకట్రావును ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు బుధవారం పరామ ర్శించారు. వెంకట్రావు తండ్రి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయనను యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జయమ్మ, డి.లక్ష్మీ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పెనుమాక వెంకట్రావు, ప్రజా నాట్య మండలి జిల్లా నాయకుడు బి.వెంకట్రావు పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

### సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - చాగల్లు

స్థానిక ఎస్‌సిఆర్‌కె విద్యా సంస్థలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వూరు శక్తి టీం సభ్యులు శక్తి యాప్, 112 ఎమర్జెన్సీ సేవలు, ఫోక్సో చట్టాలు, సైబర్ నేరాల నివారణ, సెల్ఫ్ డిఫెన్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు గంగాధర్‌రావు, ఎం.పద్మావతి, శ్రీనివాస్, యశోద, స్కూల్ ప్రెసిడెంట్ ఆళ్ల శివకుమార్, శ్రీహరి, ప్రిన్సిపల్ ఎన్‌వి.రామారావు, హెచ్‌ఎం శ్రీనివాస్, విద్యార్థునులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### బెల్ట్ షాపుల నివారణలో విఫలం

ప్రజాశక్తి - గోకవరం

గ్రామాల్లో బెల్టు షాపులను నివారించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఎపిఆర్‌సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. బుధవారం కామరాజుపేట పంచాయతీ శివరాంపట్నం గ్రామంలో బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ, గ్రామాన బెల్ట్ షాపులు విపరీతంగా పెరిగిపోయాయని, మద్యానికి బానిసలై యువత అనారోగ్యాలకు గురౌతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సతీష్, రామలింగేశ్వరరావు, కుంచె అంజిబాబు, జోకా పెద్దా, అర్జున్, రవణ, నాగేశ్వరావు, వీరలక్ష్మి, సూర్యవతి, రఘుపతి, నాగమణి, లక్మణ్ పాల్గొన్నారు.

### 12న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఈ నెల 12వ తేదీన రాజమహేంద్రవరం మోడల్ కెరీర్ సెంటర్లో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి హరీష్‌చంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా ప్రారంభం అవుతుందన్నారు. ఈ మేళాలో రాదిశా టెక్ ప్రయివేట్ లిమిట్ కంపెనీలోని జిఐఎస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఐటిఐ, డిప్లొమా నుంచి ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన, అనుభవం ఉన్న లేదా ఆశక్తి గల 19 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా https://tinyurl.com/jf1may25 లింక్ ద్వారా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి, రెజ్యూమ్, ఆధార్, సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో సిద్ధంగా మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

### దాతల సహకారం అభినందనీయం

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

స్థానిక ఎన్‌టిఆర్ కాలనీలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని వైద్యాధికారి ప్రసన్నకుమార్ అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, విజయదుర్గ గ్యాస్ ఏజెన్సీ అధినేత లయిన్ సత్తి ఆదివిష్ణు బుధవారం ఆరోగ్య కేంద్రానికి గ్యాస్ సిలిండర్ స్టవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆదివిష్ణు మాట్లాడుతూ రోగులకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ గోన గోపికృష్ణ, ఫార్మసిస్ట్ మూర్తి, డిఇఒ చందు, ఎఎన్‌ఎం జాలిం రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

### ఇ-పాస్ ద్వారా ఎరువుల అమ్మకాలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

రైతులకు అవసరమైన ఎరువులను ఇ-పాస్ ద్వారా అమ్మకాలు చేయాలని వ్యవసాయ శాఖ ఎడిఎ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని గజ్జరంలో ఉన్న డిసిఎం ఎరువుల దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు.రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. రబీ సీజన్‌లో ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి రుచిత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### కార్టూ'నిజం'




## వృద్ధ తల్లిదండ్రులను శ్రద్ధతో చూసుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వృద్ధాప్యంలో ఉన్న కన్న తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని తహశీల్దార్ పిఇఎస్‌డి.ప్రసాద్ సూచించారు. మండలంలోని చివటం గ్రామానికి చెందిన ముమ్మిడి వీరవెంకట సత్యనారాయణ భార్య మృతి చెందడంతో గత నాలుగేళ్లుగా తన కుమారుడు, కుమార్తె వద్ద నివాసం ఉంటున్నాడు. ఇటీవల వారు తనను పట్టించుకోవడంలేదని, సరిగా చూసుకోవడం లేదని ఆర్‌డిఒ కోర్టులో ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన ఆర్‌డిఒ ఆదేశాలతో బుధవారం తహశీల్దార్ ప్రసాద్ చివటం పంచాయతీ కార్యాలయం వద్ద ఫిర్యాదుదారుడు, కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు ఆరోగ్యంగా జీవించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత కన్న బిడ్డలకు ఉంటుందన్నారు. ఫిర్యాదుదారుని జీవనం నిమిత్తం అతనికి అందుతున్న రూ.4 వేల పింఛను, డిపాజిట్ సొమ్ము మీద వచ్చే రూ.3 వేల వడ్డీతో పాటు కుమార్తె రూ.4 వేలు, వికలాంగుడైన కుమారుడు రూ.3 వేలు మొత్తం రూ.14 వేలను అతనికి అందజేయాలని సూచించారు. మెడికల్ వంటి అత్యవసర సమయంలో మాత్రమే డిపాజిట్ చేసిన సొమ్ము నుంచి తీసుకొని, అతని వైద్య అవసరాలకు ఖర్చు పెట్టాలన్నారు. ఇరువురితో ఆ మేరకు అంగీకార పత్రాన్ని రాయించారు. ఈ కార్యక్రమంలో చివటం పిఎసిఎస్ ఛైర్మన్ ముళ్ళపూడి చినవెంకట పాండురంగారావు, విఆర్‌ఒ చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

తండ్రి, కొడుకు, కుమార్తెలతో మాట్లాడుతున్న తహశీల్దార్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకుడు అబ్బాయి

### యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కడియం

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. బుధవారం మండలంలోని వేమగిరి జడ్‌పి ఉన్నత పాఠశాలలో నూతన కౌన్సిల్ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎ.షరీఫ్, జిల్లా కోశాధికారి ఇవిఎస్‌ఆర్.ప్రసాద్, జిల్లా కార్యదర్శులు నాగభూషణం, కె.రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు నేతృత్వంలో ఈ ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా రవిశంకర్, అధ్యక్షులుగా వేదుల ఎస్ఎన్.శాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా బి.అబ్బాయి, ఉపాధ్యక్షులుగా బ్యూలారత్నం, ఎ.దొరబాబు, కోశాధికారిగా పివివి.గోపాలకృష్ణ, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తొలుత ఉద్యమ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఉత్తమ బోధన చేస్తూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, హక్కుల కోసం జరిగే పోరాటాల్లో ఉపాధ్యాయులు భాగస్వామ్యం కావాలని నేతలు పిలుపునిచ్చారు.

# నేరాలు ఘోరాలు

## పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - నల్లజర్ల, పెద్దాపురం

నల్లజర్ల మండలంలోని పోతవరంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.40,130 నగదు, 11 ద్విచక్ర వాహనాలు, 6 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

పెద్దాపురం మండలం ఆనూరు శివారులో బుధవారం ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ.2 వేల నగదు, 4 బైకులు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## 6.5 కిలోల వెండి ఆభరణాల చోరీ

ప్రజాశక్తి - పెద్దాపురం

రాయభూపాలపట్నంలోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో బుధవారం తెల్లవారుజామున ఆలయంలో దొంగలు పడి వెండి కిరీటం, వెండి కవచం చోరీ చేశారని పోలీసులు తెలిపారు. 6.5 కిలోల ఈ వెండి ఆభరణాలు చోరీ అయినట్లు ఆలయ చైర్మన్ గుణ్ణం వీరభద్రరావు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. ఎస్ఐ వి.మౌనిక సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## సిఐటియు మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 31 నుంచి విశాఖలో నిర్వహించే సిఐటియు ఆలిండియా సభలను జయప్రదం చేయాలని సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు పిలుపునిచ్చారు. బుధవారం శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్.విజయకుమార్ అధ్యక్షతన జిజిహెచ్ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి సిఐటియు అఖిలభారత మహాసభలు నిర్వహిస్తారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 2000 సంవత్సరంలో హైదరాబాద్‌లో మహాసభ జరిగిందన్నారు. ప్రస్తుతం 18వ అఖిలభారత మహాసభలు విశాఖ నగరంలో జరుగుతున్నాయన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందన్నారు. కార్మిక హక్కుల రక్షణ, చట్టాల పరిరక్షణపై ఈ మహాసభల్లో చర్చించి కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు జె.శేఖ, ఆర్.రమేష్, ఎం.ఎసు, ఎస్.వాసు, జె.శ్యామ్, బి.కృష్ణవేణి, బి.మంగతాయారు, డి.శారద, బి.శ్రీకాంత్, డి.దుర్గాప్రసాద్, ఎ.రవి పాల్గొన్నారు.

## ఉద్యోగులతో మంత్రి పవన్ మాటామంతీ

ప్రజాశక్తి - కాళ్లరేవు, జగ్గంపేట

పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ఉద్యోగులంతా సమిష్టిగా కృషి చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. మాటా మంతి కార్యక్రమంలో భాగంగా అమరావతి నుంచి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉద్యోగులతో ఆయన మాట్లాడారు. కాళ్లరేవు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ లక్ష్మణరావు, డిప్యూటీ ఎంపిడిఒ విజెవి.రమణ, ఎఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

జగ్గంపేట ప్రమోషన్స్ పొందిన పంచాయతీ రాజ్ ఉద్యోగులతో ఆ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ బుధవారం నిర్వహించిన మాటా మంత్రి కార్యక్రమాన్ని స్థానిక అధికారులు వీడియో ద్వారా వీక్షించారు. ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## రన్నరప్‌గా సూరిబాబు రాజు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 6 నుంచి 10 వరకూ మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి సీనియర్స్ టెన్నిస్ పోటీల్లో పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, ఎబిఆర్.రావు రన్నరప్‌గా నిలిచారు. బుధవారం జరిగిన ఫైనల్స్ పోటీలో వారు ఈ విజయం సాధించారు. పలువురు వారికి అభినందనలు తెలిపారు.

## క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక ఆర్‌సిఎం దేవాలయం ఫాదర్ మరియ దాసు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ప్రారంభించారు. బుధవారం ఎస్సీ కాలనీలో వీధుల గుండా క్రిస్మస్ తాత, దేవదూతల వేషధారణలతో విద్యుత్ కాంతుల మధ్య క్రిస్మస్ క్యారల్స్ ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని ఏసుక్రీస్తు జన్మదినాన్ని గుర్తు చేసుకుంటూ ఆనందంగా పాటల ద్వారా ఇంటింటా ప్రార్థనలు చేస్తూ క్యారల్స్ నిర్వహించారు. ఈ వేడుకల్లో కె.డేవిడ్ రాజు, యూత్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొనసాగుతున్న పోలీస్ పికెట్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

క్రైస్తవులు, విశ్వహిందూ పరిషత్ మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా స్థానిక కొత్తపేట వీధిలో చర్చి వద్ద పోలీస్ పికెట్ కొనసాగిస్తున్నారు. ఆయా ప్రాంతాలలో ప్రజలు గుమిగూడకుండా 144 సెక్షన్ విధించారు. ముందు జాగ్రత్తగా ఉన్నత అధికారుల పోలీస్ పికెట్ కొనసాగిస్తున్నారు. క్రైస్తవులు, హిందువులు మధ్య వివాదంపై తహశీల్దార్ రామ్ కుమార్ శాంతి చర్చలు జరిపారు. ఈ సమావేశంలో పాస్టర్ ఇశ్రాయేలు రాజబాబు మాట్లాడుతూ క్రైస్తవ వేడుకలు నిర్వహించుకోవడానికి తమకు అవకాశం కల్పించాలని కోరారు. లార్డ్ స్టీఫర్డ్ తమకు ఇబ్బంది కలిగిస్తున్నారని హిందువులు తెలిపారు.

## ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ నాయకపల్లిలో నిర్వహించిన ప్రత్యేక శిబిరం విజయవంతంగా ముగిసింది. బుధవారం వాలంటీర్లు గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "స్వాండ్ ఫర్ నెక్స్ట్ జెన్ అనే అవగాహన, ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళా విద్యార్థినులకు శానిటేషన్ పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రమేష్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎ.రఘునాథ్, సిహెచ్.రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

# వైసిపి ఆధ్వర్యాన బైక్ ర్యాలీలు

నిడదవోలులో సంతకాల ప్రతులతో నాయకులు

ప్రజాశక్తి - నిడదవోలు, విశ్వవోలు

వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ పట్టణంలో మాజీ ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు మాట్లాడారు. వైసిపి పాలనలో పేదలకు అందాలని ప్రతిష్టాత్మకంగా మెడికల్ కళాశాలలను నిర్మాణం చేపట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణకు పూనుకోవడం దారుణమన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజల నుంచి సేకరించిన వినతి పత్రాలను ఈ నెల 15న తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో అందజేయడం జరుగుతుందన్నారు. 17వ తేదీన మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో గవర్నర్‌కు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు, కొవ్వూరు వైసిపి పరిశీలకులు గిరిజాల బాబు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే కోటి సంతకాల కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గంలో సేకరించిన సంతకాల ప్రతులను తీసుకుని రాజమహేంద్రవరంలో పార్టీ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీని మాజీ ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 60,129 సంతకాలను ప్రజల నుంచి సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ ఎల్ఒసి మంజూరు

ఎల్ఒసిని అందజేస్తున్న రామతులసి

ప్రజాశక్తి - గోపాలపురం

ఐసియులో వెంటిలేటర్ సాయంతో వైద్యం పొందుతున్న ఆరేళ్ల చిన్నారి హఫీజా వైద్యం నిమిత్తం సిఎంఆర్ఎఫ్ నుంచి రూ.2.25 లక్షల ఎల్ఒసి మంజూరు అయింది. మండలంలోని రాజంపాలెం గ్రామానికి చెందిన షేక్ నాగూర్ మీరా బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అతని కుమార్తె షేక్ హఫీజాకు ఇటీవల తలకు బలమైన గాయం అయింది. దీంతో ఆమెను రాజమహేంద్రవరంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. 11 రోజులుగా ఆ చిన్నారి ఐసియులో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. దాతల సాయంతో ఇప్పటి వరకూ రూ.5 లక్షల వరకూ వైద్య సేవలు అందించారు. వైద్యానికి ఇంకా డబ్బులు అవసరం కావడంతో బాలిక తండ్రి తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, వైస్ సర్పంచ్ కాకర్ల జగదీష్ దృష్టికి తీసుకురాగా, వారు ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు దృష్టికి తీసుకువెళ్లారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని వివరించారు. దీంతో ఆయన సిఎంఆర్ఎఫ్ నుంచి అత్యవసర వైద్య సేవల నిమిత్తం రూ.2.25 లక్షల ఎల్ఒసిని మంజూరు చేయించారు. బుధవారం సంబంధిత ఎల్ఒసి పత్రాన్ని టిడిపి నాయకులు రామతులసి, జగదీష్ చిన్నారి తండ్రి నాగూర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలిపారు.

# పశుగ్రాశం తరలించేందుకు సహకరించాలి

జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల

ప్రజాశక్తి - గోకవరం

తిరుమల తిరుపతి గోశాలకు పసుగ్రాశం తరలించేందుకు రైతులు, ప్రజలు సహకరించాలని ఎంఎల్ఎ, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ కోరారు. బుధవారం మండలంలో రైతుల నుంచి సేకరించిన పశుగ్రాశంను తిరుమలకు తరలించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస సేవా ట్రస్ట్, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పశు గ్రాసాన్ని సేకరిస్తున్నామని, గత వారంలో కొన్ని లారీల పశుగ్రాసాన్ని తరలించినట్లు చెప్పారు. లారీలు క్షేమంగా తిరుపతి చేరుకోవడం జరిగిందని, మరో 12 లారీల పశుగ్రాశాన్ని తరలిస్తున్నట్లు చెప్పారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పశుగ్రాశాన్ని అందివ్వడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సూరంపాలెం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉంగరాల రాము, సొసైటీ ఛైర్మన్ సత్తిబాబు, మండల కన్వీనర్ పిల్లా చంటిబాబు, మంగరౌతు రామకృష్ణ, తంటికొండ దేవస్థానం ఛైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, పాలూరి బోసిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# అధ్వానంగా రైల్వే అండర్ బ్రిడ్జి రహదారి

మురుగుతో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జ్

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

మండలంలోని సింగవరం-తాళ్లపాలెం రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు అధ్వానంగా మారింది. నిడదవోలు పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఆర్ఒబి పనులతో భారీ వాహనాలు, ఇసుక లారీలు సింగవరం-తాళ్లపాలెం మీదుగా రైల్వే అండర్ బ్రిడ్జి క్రింద నుంచి తాడేపల్లిగూడెం రాకపోకలు సాగిస్తున్నాయి. భారీ వాహనాల రాకపోకలతో ఈ రోడ్డు అధ్వానంగా మారింది. రహదారిలో భారీ గుంతలు పడటంతో ప్రయాణికులు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఈ వాహనాల తాకిడికి తాళ్లపాలెం ఊళ్లోకి వెళ్ళిన తర్వాత కల్వర్టు ధ్వంసమై పెద్ద గొయ్యి ఏర్పడింది. నిడదవోలులో ఆర్ఒబి పనులు వలన తరచూ గేటు మూసివేసినప్పుడల్లా ఈ రోడ్డు ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడేదని తాళ్లపాలెం సర్పంచ్ యార్రా రామకృష్ణ తెలిపారు. భారీ వాహనాల రాకతో రహదారి అంతా గుంతలమయంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే భారీ వాహనాల రాకపోకలను నిలువరించి, ప్రత్యేక నిధులు కేటాయించి రహదారిని నిర్మించాలని సర్పంచ్ కోరారు.

# అధిక దిగుబడికి పొలంబడి దోహదం

పజాశక్తి- సామర్లకోట

తక్కువ పెట్టుబడితో రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు పొలంబడి కార్యక్రమాలు దోహదం చేస్తాయని వ్యవసాయ శాఖ ఎడిఎ కె.దుర్గాలక్ష్మి పిలుపు ఇచ్చారు. మండలంలోని ఉండూరులో బుధవారం పోలంబడి క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. సార్వా సీజన్‌లో గ్రామంలో 14 వారాలు పాటు పోలంబడి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసిన సందర్భంగా చేపట్టిన ఈ వేడుకలో ఎడిఎ కె.దుర్గాలక్ష్మి మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో అధిక నాణ్యత కలిగిన దిగుబడులు సాధించేలా వ్యవసాయ పద్ధతులను అనుసరించాలన్నారు. పొలంబడి ముఖ్య లక్ష్యాలైన ఆరోగ్యకరమైన పంట పండించడం, మిత్ర పురుగులను సంరక్షించడం, ప్రతివారం పొలాన్ని పరిశీలించడం, రైతును తన పొలం పండితునిగా తీర్చిదిద్దడం వంటి అంశాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. పొలంబడి ఆదర్శ రైతు పేపకాయల సుబ్బారావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీధర్, కొప్పిరెడ్డి వీరాస్వామి, ఉండూరు సొసైటీ అధ్యక్షుడు బత్సల వెంకటరమణ మూర్తి (జెమీ), బత్సల గంగాధర్, ఎంపిటిసి సలాది తాతాజీ, కొప్పిరెడ్డి రమణి, నిమ్మన నరసింహ ఎఇఒ రూప, శాంతికమల, విఎఎలు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కరప, గొల్లప్రోలు

**గొల్లప్రోలు** ఎస్ఎఫ్ఐ 25వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల కార్యదర్శి వడ్డి కాసులు మాట్లాడుతూ.. ఈ నెల 12, 13, 14 తేదీల్లో ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలను తిరుపతిలో నిర్వహిస్తున్నారని, ఈ మహాసభలు విద్యారంగంలో ఉన్న సమస్యలను చర్చించి వాటిని పరిష్కరించడానికి ఉపయోగ పడతాయని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వెయ్యకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతోందని, కాలేజీలు ఫీజులు కట్టమని విద్యార్థులపై ఒత్తిడి తెస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్, చరణ్, వినయ్, నవీన్, సిద్ధు, రాజీ పాల్గొన్నారు.

**కరప** ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎ.సంజయ్ వేళంగి హైస్కూల్ వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల కార్యదర్శి సంజయ్ పాల్గొన్నారు.

## 27 మందికి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట

ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 27 మందికి విడుదలైన చెక్కులను టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ బుధవారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో అందజేశారు. నియోజకవర్గంలోని 27 మందికి రూ.17.78 లక్షలు విడుదల కావడంతో వాటిని రోగుల బంధువులకు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**లింక్ దస్తావేజు పోయినది**

నా క్లయింటు **కుడిపూడి బాబు ముత్యం అనే చిన్ని**, S/o. విశ్వనాథ్, డో.నెం. 73-4-2/1, నారాయణపురం, రాజమండ్రి కాపురస్తులు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు యొక్క దస్తావేజుకు లింకు దస్తావేజు అయిన క్రయ **దస్తావేజు నెం. 6931/2010, తేది.20-8-2010, SRO, రాజానగరం** నెంబరు గల ఒరిజినల్ లింకు దస్తావేజు **ది. 02-12-2020వ తేదీన** నారాయణపురం నుండి ప్రకాష్‌నగర్ ప్రయాణించుచుండగా మార్గ మధ్యలో ఎక్కడో పడిపోయినది. ఎంత వెతికినా కనిపించలేదు. సంబంధిత పోలీసు వారికి కూడా నా క్లయింటు కంప్లైయింట్ ఇవ్వగా Not Traced అని సర్టిఫికెట్ **ది. 24-12-2020న** ఇచ్చియున్నారు. అయినప్పటికి పై నెంబరు గల ఒరిజినల్ లింకు దస్తావేజు అనగా 6931/2010 ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది అడ్రసుకు ఈ ప్రకటన తేదీ నుండి వారం రోజులలోగా తెలియపరచగలరు.

**ఎన్.రవిశంకర్, అడ్వకేట్**
**డో.నెం.79-16-05, పోస్టల్ కాలనీ**
**వివేకానంద నగర్, రాజమండ్రి**
**సెల్: 9440324108**

నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

## ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - రాజానగరం

సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలంటూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి మాట్లాడారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు అందరూ రెండేళ్లలోపు టెట్ పరీక్ష రాసి తప్పనిసరిగా పాస్ కావాలని, లేకుంటే వారిని సర్వీసు నుంచి తొలగించాలనే ఉత్తర్వులను రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయులపై బోధ నేతర పనుల భారం తగ్గించాలన్నారు. పదో తరగతి వందరోజుల ప్రణాళికలో ఆదివారాలు, సెలవు దినాలను మినహాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దయానిధి మండల అధ్యక్షురాలు రాజేశ్వరి, శీను బాబు పాల్గొన్నారు

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - చాగల్లు

రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు మండలంలోని ఊనగట్ల గ్రామానికి చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 9న చిట్యాల హైస్కూల్లో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ బీచ్ వాలీబాల్ పోటీల్లో జిల్లా స్థాయి అండర్14 విభాగంలో ఊనిగట్ల విద్యార్థినులు పంతకాని లాస్య, కంచర్ల హనీ, తొర్లపాటి. శశిధరణి ప్రథమ స్థానంలో నిలిచారని పాఠశాల హెచ్ఎం ఎన్‌వి.రమణ తెలిపారు. బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు కొయ్య. గంగాధరరావు, విద్యార్థినులను పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నందిగం శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు బొల్లిన శివనాగేంద్ర ఎస్ఎంసి ఛైర్మన్ కామన శివ, ఉపాధ్యాయులు అభినందించారు.

## ముగిసిన శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి - కడియం

శిక్షణలో పాల్గొన్న ప్రాక్టీషనర్లు

మండలంలోని వేమగిరి బుద్ధ విహార్ ప్రాంగణంలో లయ సంస్థ ఆధ్వర్యంలో ఆయుర్వేదిక్ ప్రాక్టీషనర్స్‌కు ఇచ్చిన శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఐఎన్ఎ మాజీ అధ్యక్షులు పల్ల సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు. ఆదివాసి గిరిజన ప్రాంతాల్లో ఆచార సంప్రదాయంగా కొనసాగుతున్న వనమూలిక వైద్యాన్ని తిరిగి వెలుగులోకి తెచ్చేందుకు లయ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. లయ సంస్థ కోఆర్డినేటర్ గుగ్గిలపు బుల్లియ మాట్లాడుతూ ఒకనాటి వనమూలిక వైద్యాన్ని సంరక్షించటం లయ సంస్థ లక్ష్యమన్నారు. ఇప్పటివరకు ఆరు బ్యాచులలో 126 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు శెట్టి సత్యనారాయణ, బుద్ధ విహార్ వ్యవస్థాపకులు యార్లగడ్డ జగదీశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# దళితనేత వెంకటరత్నంకు నివాళి

ప్రజాశక్తి - కడియం

మండలంలోని పొట్టిలంక గ్రామానికి చెందిన దళిత నేత నక్కా వెంకటరత్నం 11వ వర్ధంతి బిఎస్‌పి ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఆయన చిత్రపటానికి బిఎస్‌పి జిల్లా కన్వీనర్ నక్కా వెంకటరత్నంరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వెంకటరత్నం జీవితాంతం దళితుల సమస్యలపై పోరాటాలు సాగించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నక్కా దాసు, బడుగు చిన్నసత్తిరాజు, రేముళ్ళ సంజేరావు, నక్కా సత్తిరాజు, బడుగుపల్లయ్య, రేముళ్ళ సత్తియ్య, నక్కా యేసేబు, కొల్లపు గంగరాజు, పల్లి వీర్రాజు, చింతల విశ్వేశ్వరరావు, దాసి రాజు, నెల్లి నరసింహ మూర్తి, దాసి సుభాష్ పాల్గొన్నారు.

## గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ వైద్య పరీక్షలు, వైద్య సేవల నిమిత్తం బుధవారం వచ్చిన గర్భిణులకు మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మండల తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమామహేశ్వరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫేస్బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ కాకినాడకు చెందిన ఫ్రెండ్స్ ఫర్ ఫ్రెండ్ అసోసియేషన్ సహాయ సహకారాలతో ఈ అన్నదానం నిర్వహించామన్నారు.

**ఒరిజినల్ లింక్ దస్తావేజు పోయినది**

మామిడి రాజ్యలక్ష్మి భర్త వీరేశలింగం డోర్‌నెం. 6-3-5/1/3, TRISTAR HOMES 1st Floor కన్నాపురం ఖమ్మం జిల్లాలో నివసిస్తున్న నేను తెలియజేయునది. నాయొక్క 03-12-2025 దస్తావేజు నెం.11658/2025 SRO రాజమండ్రికు సంబందించిన ఒరిజినల్ లింక్ దస్తావేజు అయిన ది.16-12-1989 దస్తావేజు నెం.8996/1989 SRO రాజమండ్రి నెంబరు గల దస్తావేజు ది.04-12-2025 వ తేదిన శ్యామలా సెంటర్ ఏరియాలో కలర్ జిరాక్స్ తీసుకోవడానికి వెళ్ళుతుండగా పడిపోయినది.రాజమండ్రి 2టౌన్ పోలీస్‌స్టేషన్ పరిదిలోకి వస్తుంది. ఎవరికైన లింక్ దస్తావేజు దొరికిన యెడల ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

**మామిడి రాజ్యలక్ష్మి**
**సెల్.9848244274**

**PUBLICATION**
**IN THE COURT OF THE HON'BLE ASST SESSIONS AND SENIOR CIVIL JUDGE: Dr. B. R. AMBEDKAR KONASEEMA DIST: AMALAPURAM**
**IP No.18 of 2025**

Between:
**Shriram Finance Limited,** Amalapuram Branch, rep by its GPA holder **S.Subrahmanyeswara Rao, Amalapuram** ...Petitioner

Vs

**Tirugulla Bhima Shankar and others** ...Respondents

**Respondents 1: Tirugulla Bhima Shankar**, S/o. Satyam, D.No.6-135, Gowtham Nagar, Peruru, Amalapuram (M) -533218
**Respondents 2: Muttabattula Suryanarayana**, S/o.Bhethala Swamy, D.No.7-64, Ambedkar Nagar, Ramalayam Street, Peruru, Amalapuram (M) -533218
**Respondents 3: Tirugulla Manga Devi,** W/o. Bhima Shankar, D.No.6-135, Gowtham Nagar, Peruru, Amalapuram (M) -533218

The above named Petitioner company has instituted the above Insolvency Petition against you, and the same stands posted to **17-12-2025** at **10.30 A.M.** for your appearance, you are hereby required to appear personally or through advocate attend before this Hon'ble court at 10.30 AM and file your objections if any, failing which the matter will be heard and determined in your absence exparte as per Law.

//by the orders of the Hon'ble court//

**V.R.Vidya Sankaram,**
Amalapuram — Advocate, Amalapuram
Dt.09-12-2025 — Cell: 98492 93793

**దస్తావేజు పడి పోయినది**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం వివి మెరక గ్రామం ప్రగతి నగర్ కు చెందిన బత్తుల లక్ష్మణరావు S/o.వెంకట స్వామి కు చెందిన ప్రోపర్టీ దస్తావేజు పడిపోయినది. దస్తావేజు నెంబర్ 631/1-2003. ది.05-12-2025 తేదీన మలికిపురం సెంటర్లో ప్రోపార్టీ దస్తావేజు జిరాక్స్ తీయించుకొని వివి మెరక గ్రామం ప్రగతి నగర్‌లోని ఇంటికి తిరిగి వెళ్ళు తుండగా మార్గం మధ్యలో పడిపోయింది. దస్తావేజు దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

**బత్తుల లక్ష్మణరావు**
**S/o.వెంకట స్వామి**
**డోర్‌నెం.3-7, వివిమెరక గ్రామం**
**ప్రగతి నగర్, సఖినేటిపల్లి మండలం**

**పాస్‌పోర్టు పడిపోయినది**

డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం, పేరవరం గ్రామానికి చెందిన రంకిరెడ్డి మౌనిక, భర్త ఇమ్మానియేలు అను నేను ది.06-12-2025 సం॥రం॥ తేదీన నా పాస్‌పోర్టునెం. **U1856034**ను తీసుకుని పాస్‌పోర్టు రెన్యూవల్ నిమిత్తం పేరవరం సెంటరుకు వచ్చేసరికి నా పాస్‌పోర్టు ఒరిజినల్ గల బ్యాగ్ ఎక్కడో పడిపోయినది. నా పాసుపోర్టు కొరకు చుట్టు ప్రక్కల అంతా వెతికిన దొరకలేదు. దొరికిన యెడల క్రింది అడ్రస్‌కు ఇవ్వగలరు

**రంకిరెడ్డి మౌనిక**
**భర్త ఇమ్మానియేలు**
**పేరవరం గ్రామం, ఆత్రేయపురం మండలం**
**డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా**
**సెల్. 8297721300**

రోగులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి

## త్వరితగతిన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - కడియం

రోగులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా త్వరితగతిన సేవలు అందించాలని ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి సూచించారు. బుధవారం స్థానిక పిహెచ్‌సిని ఎంఎల్ఎ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బారులు తీరి నిరీక్షిస్తున్న రోగులను పలకరించి అందుతున్న సేవలపై ఆరాతీశారు. సత్వరం వైద్య సేవలు అందేలా చూడాలని వైద్యులను ఆదేశించారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉందని తెలుపగా నివేదిక అందించాలని సూచించారు. అనంతరం స్క్రబ్ టైఫాస్ వంటి వ్యాధులకు పరీక్షలు చేసేందుకు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రత్నమాధురిని ఆరా తీశారు. ఈ పర్యటనలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి నాని, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు

## ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని వైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అరవిందకుమార్ పాల్గొని మాట్లాడారు. మానవ హక్కులకు భంగం కలిగితే జాతీయ, రాష్ట్ర, మానవ హక్కుల కమిషన్‌ను, లేదా పోలీసులను ఆశ్రయించవచ్చునని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు మానవ హక్కులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ మానవ హక్కులను గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పని ప్రదేశంలో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

ఉపాధి పని చేస్తూ ఒక వృద్ధుడు మృతి చెందాడు. బుధవారం మండలంలోని రేగులకుంటకు చెందిన చెందిన ఉపాధి కూలి చల్లా సత్యనారాయణ (72) బుధవారం ఉదయం ఏడు గంటలకు ఉపాధి కూలీలతో కలిసి పనికి వచ్చినట్లు తెలిపారు. సత్యనారాయణ పని ప్రదేశంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయినట్లు తెలిపారు. వెంటనే అతనని ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకెళ్లారు. స్థానిక ప్రయివేటు వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారని ఫీల్డ్ అసిస్టెంట్ దినేష్ తెలిపారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలో గురువారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారి ఎన్.నారాయణ అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి మార్కెట్ ఫీడర్‌లో ఆర్ఒబి పనుల నిమిత్తం బస్ స్టాండ్ రోడ్డు, కోర్ట్ ఏరియా, మునిసిపల్ ఆఫీస్ ఏరియాలో గృహ, వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

**ప్రకటన**
**మహారాజశ్రీ భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), భీమవరం వారి కోర్టులో**
**O.S.No.289/2008**

Between:
**వాది :** వావిలాల విజయలక్ష్మి
Vs
**ప్రతివాది:** వావిలాల లక్ష్మీకాంతం వగైరా
**4వ ప్రతివాది :** బేత ఇందిరదేవి, W/o.కృష్ణ, గుడ్డిగూడెం, గోపాలపురం మండలం, తూ.గో.జిల్లా.

పై నంబరు దావాలో అనేక పర్యాయములు 4వ ప్రతివాదికి శ్రీకోర్టు వారి ద్వారా సమన్లు పంపించినప్పటికీ అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము పై 4వ ప్రతివాది ది.22-12-2025 సం॥ తేదీన ఉదయం 10.30 గం॥లకు మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను. అట్లు కాని ఎడల శ్రీకోర్టు వారు మీ పరోక్షమందు తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది.

**కూనపరాజు గోపాలకృష్ణంరాజు**
ప్రాంతం:భీమవరం — వాది తరపు అడ్వకేట్
తేది.10-12-25 — శ్రీరామపురం, భీమవరం.

**మహారాజశ్రీ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) అమలాపురం వారి కోర్టులో**
**I.P.No.9/2023**

**Between:-**
మున్నింగి సత్య సంతోష్ కుమార్ ...పిటిషనర్
మరియు
నిల్లా నాగేశ్వరరావు వగైరా ...రెస్పాండెంట్లు టు.

**R16.** అక్కల తాతబ్బాయి నాయుడు తండ్రి వెంకటేశ్వరరావు, డోర్‌నెం.1-11, మెయిన్‌రోడ్డు, నంగవరం, ఉప్పలగుప్తం మండలం, డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్
**R 21.** నుదురుపాటి శ్రీనివాస్ తండ్రి Not-known, ప్లాట్ నెం.97, విపాశన వద్ద, పోలీస్ కాలనీ, కుసుమనగర్, వనస్థలిపురం, హైదరాబాద్, తెలంగాణా రాష్ట్రం.
**R49.** దివేదుల సతీష్ తండ్రి చంద్రశేఖర్ C/o. డి.చంద్రశేఖర్, డోర్‌నెం. 5-122, కంసాలివారి వీధి, కాకినాడ, కాకినాడ జిల్లా.
**R50.** గొలకోట ఫణీంద్రకుమార్ తండ్రి సర్వేశ్వరరావు, డోర్‌నెం.9-152-1, ఈనాడు టెంట్ హౌస్ వద్ద,ఇంద్రపాలెం, కాకినాడ, కాకినాడ జిల్లా.

యిందలి పిటిషనరు తనను ఇన్‌సాల్వెంటుగా డిక్లేర్ చేయమని వగైరా పరిహారములు కోరుతూ ఐ.పి. మీ వగైరాలపై దాఖలు చేయగా సదరు పిటిషనులో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ ఉద్దేశపూర్వకముగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున సదరు ఐ.పి. మీ హాజరు కోరుతూ **ది.19-12-2025** నాటికి వేసినారు. కావున ఆరోజు ఉదయం**10.30ని॥లకు** లగాయితు మీరు స్వయముగాగాని, వకీలు ద్వారా గాని హాజరయి, మీకు గల ఆక్షేపణలు తెలుపగలరు లేని యెడల ఐ.పి. మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా శ్రీ కోర్టువారి ఉత్తర్వుల రీత్యా తెలియజేయడమైనది.

**N.S.N.Murthy**
అమలాపురం — పిటిషనరు తరపు న్యాయవాది
ది.8-12-2025 — సెల్.9441767978